తెలంగాణ

TELANGANA MUCHATLU

ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | ఆదివారం - 10 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 342 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు




కోర్ అర్బన్ రీజియన్ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి వివరణ

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి బహుళ ప్రణాళికలు

మూసీ పునరుజ్జీవంతో కాలుష్య నియంత్రణపై దృష్టి

తెలంగాణ రైజింగ్–2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

**హైదరాబాద్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ సమస్యలను పరిష్కరిస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని నగరాభివృద్ధి ప్రణాళికలను వివరించారు. పెరుగుతున్న నగరీకరణతో భవిష్యత్తులో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశముందని పేర్కొన్న ముఖ్యమంత్రి, వాటిని ఎదుర్కొనేందుకు ముందస్తుగా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. హైదరాబాద్‌ను ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు కీలక ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, ఉపరితల రహదారుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.

మిగతా 2లో..



# రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోంది: హరీశ్

- కొనుగోలు కేంద్రాల్లో రైతుల అవస్థలపై తీవ్ర ఆగ్రహం
- సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యమని విమర్శ
- తరుగులు, బీ-గ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారన్న ఆరోపణ

**సిద్దిపేట, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన సన్ ఫ్లవర్, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో 40 రోజులుగా పడిగాపులు కాస్తున్న రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతుల పరిస్థితిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అకాల వర్షాలు, వడగండ్ల వానలతో రైతులు ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కూడా వారాల తరబడి కేంద్రాల వద్దే ఉండాల్సిన పరిస్థితి రావడం దారుణమన్నారు.

మిగతా 2లో..

# ప్రజలకు భారీ ఊరట

## రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు

- ఈ నెల 12 నుంచి 15 వరకు ప్రత్యేక సేవలు
- ఉదయం 9:30 నుంచి సాయంత్రం 6:30 వరకు పని వేళలు
- రిజిస్ట్రేషన్ల రద్దీ దృష్ట్యా కీలక నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం




**హైదరాబాద్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో భూముల ధరల సవరణ నిర్ణయం తర్వాత రిజిస్ట్రేషన్లకు భారీగా డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు అమలు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం భూముల విలువల సవరణ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద భారీ రద్దీ నెలకొంది. స్లాట్ బుకింగ్‌ల కోసం ప్రజలు పోటీపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అదనపు పని వేళలను అమలు చేయాలని నిర్ణయించింది. ఈ ప్రత్యేక ఏర్పాట్ల ప్రకారం ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేయనున్నాయి. అవసరమైతే పని వేళలను మరింత పెంచేందుకు కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు పూర్తిస్థాయిలో

మిగతా 2లో..



# బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

- పరస్పరం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు
- బ్లాక్‌మెయిల్ చేస్తున్నారంటూ భగీరథ్ ఆరోపణ
- అసభ్య ప్రవర్తనపై బాలిక ఫిర్యాదు

**హైదరాబాద్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ్, ఓ బాలిక పరస్పరం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకోవడం రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ఇరుపక్షాల ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కొంతమంది స్నేహితుల ద్వారా పరిచయమైన బాలిక డబ్బు కోసం బ్లాక్‌మెయిల్ చేస్తూ మానసికంగా వేధిస్తోందంటూ భగీరథ్ కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికతో పాటు ఆమె తల్లిదండ్రులపై కూడా ఫిర్యాదులో ఆరోపణలు చేసినట్లు సమాచారం. భగీరథ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ ప్రారంభించారు. మరోవైపు అదే రోజు రాత్రి బాలిక మల్కాజ్‌గిరి జిల్లా పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై ఫిర్యాదు చేసింది. గత డిసెంబర్ 31న మొయినాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల సందర్భంగా భగీరథ్ తనతో అసభ్యంగా ప్రవర్తించాడని బాలిక ఆరోపించింది. స్నేహితులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొంది.

మిగతా 2లో..




# మల్కాపూర్ టెర్మినల్‌ను జాతికి అంకితం చేయనున్న మోదీ

- తెలంగాణ ఇంధన భద్రతకు కీలక ప్రాజెక్టు
- రూ. 611 కోట్లతో నిర్మించిన ఆధునిక టెర్మినల్
- భారీ నిల్వ సామర్థ్యంతో ఇంధన సరఫరాకు ఊతం

**హైదరాబాద్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా మల్కాపూర్ టెర్మినల్‌ను మే 10న ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రూ. 611 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అత్యాధునిక టెర్మినల్ రాష్ట్ర భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషించనుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సుమారు 89 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. మల్కాపూర్ టెర్మినల్‌లో మొత్తం 1 లక్ష 65 వేల కిలోలీటర్ల ఇంధన నిల్వ సామర్థ్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇందులో 60 వేల కిలోలీటర్ల పెట్రోల్, 68 వేల కిలోలీటర్ల డీజిల్, 26 వేల కిలోలీటర్ల విమాన ఇంధనం, 11 వేల కిలోలీటర్ల ఇతర ఇంధన నిల్వ సదుపాయాలు ఉన్నాయని వివరించారు. ఇంధన రవాణాను వేగవంతం చేయడానికి బాటమ్ లోడింగ్ వ్యవస్థతో కూడిన ఆధునిక లోడింగ్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెర్మినల్ ద్వారా రాష్ట్రంలో ఇంధన సరఫరా మరింత సమర్థవంతంగా మారుతుందని అధికారులు పేర్కొన్నారు

మిగతా 2లో..

# కరీంనగర్ బంద్ ఉద్రిక్తం.. గంగుల కమలాకర్ అరెస్ట్



- క్యాంప్ కార్యాలయంపై దాడికి నిరసనగా బంద్
- ఇంటి వద్ద నుంచే మాజీ మంత్రిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పలువురు బీఆర్ఎస్ నేతల అరెస్టు

2లో

# పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉద్యమం తీవ్రం చేస్తాం



- దసరా లోపు పనులు ప్రారంభించకపోతే పాదయాత్ర చేపడతామని హెచ్చరిక
- సాగునీటి సాధన కోసం తెలంగాణ రక్షణ సేన పోరాట పిలుపు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- మహిళలు, యువతకు పెట్టుబడి సహాయం అందిస్తామని కవిత హామీ

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై ఉద్యమం తీవ్రం చేస్తాం

**షాద్‌నగర్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనుల్లో పురోగతి లేకపోవడంపై తెలంగాణ రక్షణ సేన తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జోగులాంబ అమ్మవారి ఆశీస్సులతో పాలమూరు, రంగారెడ్డి ప్రాంత ప్రజలతో కలిసి సాగునీటి సాధన కోసం పోరాటానికి శ్రీకారం చుట్టినట్లు కల్వకుంట్ల కవిత తెలిపారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చౌదరిగూడెం మండలం లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సాధన సభలో నేతలు మాట్లాడారు. కృష్ణానది సమీపంలో ప్రవహిస్తున్నప్పటికీ ఆ నీటిని వినియోగించుకునే అవకాశం లేకుండా పాలకులు వ్యవహరించారని విమర్శించారు. సాగునీటి హక్కుల కోసం ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసినప్పటికీ రైతులకు ఆశించిన స్థాయిలో నీరు అందలేదని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో కూడా ప్రాజెక్టు పనుల్లో ఎలాంటి పురోగతి చూపలేదని మండిపడ్డారు. పాలమూరు ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఇక సహించబోమని తెలిపారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులను దసరా పండుగలోపు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గడువు విధించారు. ఆలోపు పనులు ప్రారంభించకపోతే ప్రాజెక్టు పరిధిలో విస్తృత పాదయాత్ర చేపట్టి ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలు, యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడానికి పెట్టుబడి సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలకు ప్రోత్సాహం కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.
సభలో పలువురు నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. సాగునీటి సమస్య పరిష్కారం వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

# కరీంనగర్ బంద్ ఉద్రిక్తం.. గంగుల కమలాకర్ అరెస్ట్

**కరీంనగర్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన కరీంనగర్ బంద్ కొనసాగుతోంది. నగరంలో పలు ప్రాంతాల్లో బంద్ ప్రభావం కనిపించింది. బీజేపీ గూండాలు దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గంగుల కమలాకర్ నివాసం వద్ద భారీగా పోలీసులు మోహరించారు. అనంతరం ఆయన్ను ఇంటి వద్ద నుంచే అదుపులోకి తీసుకుని ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గంగుల కమలాకర్‌తో పాటు మాజీ మేయర్ రవీందర్ సింగ్, ఏనుగు రవీందర్ రెడ్డి సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను కూడా పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. అరెస్టులకు నిరసనగా పార్టీ కార్యకర్తలు ఆందోళనలు చేపట్టారు. నగరంలో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రశాంతంగా బంద్ నిర్వహిస్తున్నప్పటికీ నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని మండిపడ్డారు. ఇదిలా ఉండగా నగరంలో పలు దుకాణాలు, వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేయబడ్డాయి. బంద్ నేపథ్యంలో రవాణా కూడా కొంత మేర ప్రభావితమైంది. పోలీసులు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు.

# ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యంగా ప్రభుత్వ ప్రణాళికలు

(మొదటి పేజీ తరువాయి).

కేవలం రోడ్ల విస్తరణతోనే ట్రాఫిక్ సమస్యలు తగ్గవని, బహుళ రవాణా విధానాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. నగరంలో పార్కింగ్ సమస్యలను తగ్గించేందుకు మల్టీ లెవెల్ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజా రవాణాను మరింత బలోపేతం చేయడానికి ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రాన్ని సీఐయూఆర్, పీఐయూఆర్, ఆర్ఏఆర్ ఈ ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించామని ముఖ్యమంత్రి వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని సర్వీస్ సెక్టార్‌గా, రీజనల్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని తయారీ రంగ అభివృద్ధికి అనుకూల ప్రాంతంగా, ఆ తర్వాతి గ్రామీణ ప్రాంతాలను వ్యవసాయ ఆధారిత ఆర్థిక మండలాలుగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా హైదరాబాద్‌ను కాలుష్య సమస్యల నుంచి కాపాడటంతో పాటు నగర సంస్కృతితో అనుసంధానం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. నగరంలో ఈవీ బస్సులను ప్రవేశపెట్టడమే కాకుండా ఆటోలను ఉచితంగా ఈవీ వాహనాలుగా మార్చే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో హైదరాబాద్ తాగునీటి సరఫరా, పట్టణాభివృద్ధి, మూసీ పునరుజ్జీవం వంటి అంశాలపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు దేశంలోనే విప్లవాత్మక కార్యక్రమమని స్టాండింగ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను కమిటీ సభ్యులకు ముఖ్యమంత్రి అందజేశారు.

# రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా దోచుకుంటోంది: హరీశ్

(మొదటి పేజీ తరువాయి).

రైతుల బాధలపై ప్రభుత్వానికి కనీస స్పందన లేదని విమర్శించారు.
ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ధాన్యం కొనుగోళ్లపై ఒక్క సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వరి కోతలు ప్రారంభమయ్యే ముందే మంత్రులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి సంచులు, లారీలు, నిధులు సిద్ధం చేసేవారని గుర్తు చేశారు. రైతులను కంటికి రెప్పలా కాపాడిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. చిన్నకోడూరు ప్రాంతంలో రైతులు ఎకరాకు 9 నుంచి 10 క్వింటాళ్ల సన్ ఫ్లవర్ దిగుబడి సాధిస్తున్నప్పటికీ కేవలం ఆరున్నర క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధన పెట్టిందని విమర్శించారు. తీరా ఆ పరిమితి మేరకు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ కోటా ముగిసిందనే కారణాలు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.
పొద్దున్న లేస్తే పంటల మార్పిడి చేయాలని రైతులకు సూచించే ప్రభుత్వం, రైతులు సన్ ఫ్లవర్, మక్కలు, శనగలు, జొన్నలు పండిస్తే వాటిని ఎందుకు కొనుగోలు చేయడం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. ఒకవైపు పంటల మార్పిడి చేయమని చెప్పి, మరోవైపు ఆ పంటలను కొనకుండా రైతులను నష్టాల్లోకి నెట్టడం ద్వంద్వ వైఖరి కాదా అని విమర్శించారు. జొన్న పంటను గతంలో ప్రతి ఏడాది కొనుగోలు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని తెలిపారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం జొన్నలు కొనడం లేదని, సన్ ఫ్లవర్ కొనుగోళ్లు పూర్తిగా ఆపేసిందని ఆరోపించారు. మక్కలకు కూడా పరిమితులు విధించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు.
సంచులు కూడా రైతులే తెచ్చుకోవాలని చెప్పడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని హరీశ్ రావు విమర్శించారు. రైతులకు సంచులు సరఫరా చేసే సామర్థ్యం లేని ప్రభుత్వం ఢిల్లీ పర్యటనలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లినా ఒక్కసారి కూడా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినలేదని అన్నారు. వడ్లను రైస్ మిల్లులు తీసుకోవడం లేదని, కొనుగోలు కేంద్రాల్లో బస్తాకు కిలో తరుగు వేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. బీగ్రేడ్ పేరుతో ఎకరాకు వందల రూపాయల నష్టం వస్తోందన్నారు. ఒకవైపు తరుగులు, మరోవైపు మిల్లుల్లో కటింగ్స్‌తో రైతులు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
సన్న వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట తప్పారని హరీశ్ రావు విమర్శించారు. బోనస్ ఎగ్గొట్టడమే కాకుండా తరుగులు, బీగ్రేడ్ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. చిన్నకోడూరులో సన్ ఫ్లవర్ కొనుగోళ్లు నిలిపివేయడంతో కుప్పల కింద పంట చెడిపోతోందన్నారు. మద్దతు ధర రూ. 7,720 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ. 5 వేలకే కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు ఎకరాకు వేల రూపాయలు నష్టపోతున్నారని చెప్పారు. రైతుబంధు లేక, మద్దతు ధర అందక రైతులు అప్పుల పాలవుతున్నారని మండిపడ్డారు. సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో గత నాలుగు రోజులుగా నిల్వలు పేరుకుపోయి లారీలు లేక పంటలను లోపలికి అనుమతించడం లేదని హరీశ్ రావు అన్నారు. ఒక రైతు పంట అమ్ముకోవాలంటే తేమ పరీక్షకు వారం, సంచుల కోసం వారం, కాంటాకు వారం, లారీల కోసం వారం ఇలా నెల రోజుల పాటు కల్లాల వద్దే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. రైతులను ఆదుకోని ప్రభుత్వం ప్రజల నమ్మకం కోల్పోతుందని హరీశ్ రావు హెచ్చరించారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# మల్కాపూర్ టెర్మినల్‌ను జాతికి అంకితం చేయనున్న మోదీ

(మొదటి పేజీ తరువాయి).

రాష్ట్ర పారిశ్రామిక, రవాణా రంగాలకు ఈ ప్రాజెక్టు పెద్ద ఊతం ఇస్తుందని బీజేపీ నాయకులు అభిప్రాయపడ్డారు. పెరుగుతున్న ఇంధన అవసరాలకు అనుగుణంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని టెర్మినల్‌ను నిర్మించినట్లు తెలిపారు. మల్కాపూర్ టెర్మినల్ ప్రారంభంతో తెలంగాణలో ఇంధన నిల్వ, పంపిణీ వ్యవస్థ మరింత బలోపేతం కానుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు

(మొదటి పేజీ తరువాయి).

బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఇరుపక్షాల ఆరోపణల నేపథ్యంలో ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలు నమోదు చేయడంతో పాటు ఘటన జరిగిన ప్రదేశానికి సంబంధించిన ఆధారాలను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన అంశాలపై పోలీసులు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# ప్రజలకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి).

అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
చంపాపేట్, సరూర్‌నగర్, వనస్థలిపురం, గండిపేట్, మహేశ్వరం, ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్, రంగారెడ్డి రూరల్, ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి, ఘట్‌కేసర్, నల్గొండ ఆర్ఓ, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్ కార్యాలయాల్లో ఈ అదనపు పని వేళలు అమల్లో ఉండనున్నాయి. రిజిస్ట్రేషన్లకు వచ్చే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ప్రజలు ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగంగా సేవలు అందించాలని, ప్రతి దరఖాస్తును సమయానికి పూర్తి చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, మధ్యవర్తులకు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు. భూముల ధరల సవరణ నేపథ్యంలో చాలా మంది ముందుగానే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. దీంతో హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రద్దీ భారీగా పెరిగింది. రోజుకు వేల సంఖ్యలో స్లాట్ బుకింగ్‌లు నమోదవుతున్నట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. అవసరమైతే మరిన్ని కార్యాలయాల్లో కూడా అదనపు పని వేళలు అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ప్రత్యేక పని వేళల నిర్ణయంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన రద్దీ సమయంలో ఈ నిర్ణయం ఎంతో ఉపశమనంగా మారుతుందని అభిప్రాయపడుతున్నారు. అధికారులు కూడా ప్రజల సహకారంతో సేవలను మరింత వేగంగా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

# మూసీలో పడిపోయిన మహిళకు ప్రాణదాతగా హైడ్రా

**హైదరాబాద్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** అంబర్‌పేట్ పరిధిలోని గోల్నాక సమీపంలో మూసీలో పడిపోయి ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న మహిళను హైడ్రా డీఆర్ఎఫ్ బృందం సాహసోపేతంగా రక్షించింది. సమాచారం అందిన కొద్ది నిమిషాల్లోనే ఘటనాస్థలానికి చేరుకున్న సిబ్బంది సమయస్ఫూర్తితో స్పందించి మహిళ ప్రాణాలను కాపాడారు. భాగ్యనగర్ ప్రాంతానికి చెందిన ఇందిర అనే మహిళ శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు మూసీలో జారి పడినట్లు అధికారులు తెలిపారు. శనివారం ఉదయం స్థానికులు మహిళను గుర్తించి బయటకు తీసేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. హైడ్రా సిబ్బంది రక్షణ చర్యలు కొనసాగిస్తున్న సమయంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా అక్కడకు చేరుకున్నారు. పెద్ద నిచ్చెన సాయంతో డీఆర్ఎఫ్ సభ్యులు మూసీలోకి దిగిపోయి ప్రాణభయంతో కొట్టుమిట్టాడుతున్న మహిళను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.



# బీసీల కులగణన కు కేంద్రంపై ఒత్తిడి పెంచాలి: తీన్మార్ మల్లన్న

- హనుమంతరావు నిరాహార దీక్షకు టీఆర్పీ సంపూర్ణ మద్దతు
- బీసీలకు నిజమైన సామాజిక న్యాయం కులగణనతోనే సాధ్యమని వ్యాఖ్య
- అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక



**హైదరాబాద్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్త జనగణనలో బీసీలకు ప్రత్యేకంగా కులవారీ గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ, ప్రభుత్వ సలహాదారు వి హనుమంతరావు అంబర్‌పేటలోని తన నివాసంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న స్వయంగా హనుమంతరావును కలిసి దీక్షకు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ బీసీలకు నిజమైన సామాజిక న్యాయం అందాలంటే కులగణన అత్యంత కీలకమని పేర్కొన్నారు. దేశంలో బీసీలు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ వారి జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సరైన గణాంకాలు లేకపోవడం వల్ల సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
బీసీల జనాభా ఎంత ఉందో ఖచ్చితమైన లెక్కలు లేకుండా రిజర్వేషన్లు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు సరైన రీతిలో అమలు చేయడం అసాధ్యమని తీన్మార్ మల్లన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీల కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయం పేరుతో మాట్లాడే ప్రభుత్వాలు బీసీల వాస్తవ పరిస్థితులను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎప్పటికప్పుడు బీసీల సమస్యలపై స్పందిస్తూ వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. రాష్ట్ర జనాభాలో బీసీల వాటా గణనీయంగా ఉన్నప్పటికీ అధికారిక డేటా లేకపోవడం వల్ల అభివృద్ధి అవకాశాలు తగ్గుతున్నాయని విమర్శించారు.
హనుమంతరావు చేపట్టిన ఈ ఆమరణ నిరాహార దీక్ష సాధారణ నిరసన కాదని, బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభ్యున్నతి కోసం జరుగుతున్న చారిత్రక పోరాటమని తీన్మార్ మల్లన్న అభివర్ణించారు. బీసీల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకువచ్చే ఉద్యమంగా ఇది మారాలని ఆకాంక్షించారు. జనగణనలో బీసీల కులగణనను వెంటనే చేర్చాలని, బీసీల జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. బీసీలకు సంబంధించిన డేటా లేకపోవడం వల్ల అనేక వర్గాలు అభివృద్ధికి దూరమవుతున్నాయని పేర్కొన్నారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. బీసీల హక్కుల సాధన కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. హనుమంతరావు చేస్తున్న పోరాటం ప్రశంసనీయమని పేర్కొంటూ, బీసీల భవిష్యత్తు కోసం సమాజంలోని ప్రతి వర్గం మద్దతు ఇవ్వాలని కోరారు. బీసీల అభ్యున్నతి కోసం ఉద్యమం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హనుమంతరావు దీక్ష విజయవంతం అయ్యే వరకు అన్ని విధాలా అండగా ఉంటామని ప్రకటించారు.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# ఉపాధి హామీ పనిలో విషాదం.. గుండెపోటుతో కూలీ మృతి



**వేలేరు, మే 9(తెలంగాణ ముచ్చట్లు):** హన్మకొండ జిల్లా వేలేరు మండలంలోని షోడశపల్లి గ్రామానికి చెందిన కీర్తి కొమురయ్య ఉపాధి హామీ పథకం (NRGS) 100 రోజుల పనిలో భాగంగా ఎర్రకుంట చెరువులో శనివారం పని చేస్తుండగా విషాదం చోటుచేసుకుంది.

రోజువారీ కూలీ పనులు నిర్వహిస్తున్న సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలినట్లు తోటి ఉపాధి కూలీలు తెలిపారు. వెంటనే స్పందించిన సహచరులు చికిత్స కోసం తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు సమాచారం.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృతుడు కీర్తి కొమురయ్య కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని ఉపాధి కూలీలు మరియు గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారులు వేసవి కాలంలో ఉపాధి పనుల సమయంలో కూలీల ఆరోగ్య భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మాజీ మంత్రి వనమాతో నామ భేటీ



**పాల్వంచ పట్టణంలో మాజీ ఎంపీ నామ పర్యటన**

**ఖమ్మం బ్యూరో , మే9 (తెలంగాణ ముచ్చట్లు ):** బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శనివారం పాల్వంచ పట్టణంలో పర్యటించారు. ముందుగా మాజీ మంత్రి వనమా వెంకటేశ్వర రావు స్వగృహానికి వెళ్లి వారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చించారు. అంతకు ముందు వనమా ఇంటి వద్ద మాజీ ఎంపీ నామకు పాల్వంచ రూరల్, పట్టణ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లుకు మాజీ ఎంపీ నామ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం మాజీ ఎంపీ నామ మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ సూచనలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ప్రజలకు చేరువగా ఉండి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు ఆ తర్వాత పాల్వంచ పట్టణ వాస్తవ్యులు దొప్పలపూడి సురేష్ బాబుసత్యవాణి దంపతుల కుమార్తె వివాహ వేడుక శనివారం రాత్రి జరగనున్న నేపథ్యంలో ముందుగానే మధ్యాహ్నం వారి స్వగృహానికి వెళ్లి నూతన వధువును ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అక్కడ నుండి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పాల్వంచ పట్టణ వాస్తవ్యులు రమణమూర్తి నాయుడు నివాసానికి వెళ్లి ఇటీవల ఆయనకు సర్జరీ జరగగా వివరాలు అడిగి తెలుసుకొని వారిని పరామర్శించారు. వైద్యుల సూచనలు పాటించాలని సూచించి తిరిగి త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. నాయుడు కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు వనమా రాఘవ, మొరంపూడి ప్రసాద్ రావు, పాల్వంచ మండల మాజీ అధ్యక్షులు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్ మూర్తి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు గోవాడ గుణచరిత్, సింధు తపస్వి, గుగులోత్ రాంబాబు, కోఆపరేటివ్ సొసైటీ ఉపాధ్యక్షులు కాంపెల్లి కనకేష్ పటేల్, మాజీ ఎంపీపీ సరస్వతి, ఉర్దుగా మాజీ చైర్మన్ అన్వర్ భాష, చిన్నంశెట్టి రంగయ్య, రెడ్డి నాయక్, నాయకులు ముత్యాల ప్రవీణ్, దాసరి నాగేశ్వరరావు, వాకదాని కోటేశ్వరరావు, భూక్య వీరన్న, శంకర్, జూపెల్లి దుర్గాప్రసాద్, హర్షవర్ధన్, ప్రభాకర్ రెడ్డి, పత్తిపాటి శ్రీను, దాసరి సురేష్, బిఎల్ నాయుడు, వంశీ, బొదుగుల శ్రీధర్, కంచర్ల రామారావు, అఖిల్, సేమియా, కాలం రాజమ్మ, ఏనుగుల శీను, ఆర్ఎంపి శీను, హైమద్, బత్తుల శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు



# డిమాండ్ల సాధనకు వీఓఏల సమ్మె బాట

- ఎమ్మెల్యే మట్టా రాగమయికి వినతిపత్రం.
- ఐదు మండలాల వీఓఏల డిమాండ్.



**సత్తుపల్లి, మే 9(తెలంగాణ ముచ్చట్లు):**తెలంగాణ రాష్ట్రంలోని వీఓఏల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు తెలంగాణ ఐకేపీ వీఓఏ జేఏసీ నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఐదు మండలాలకు చెందిన వీఓఏలు సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా కమల్ పాషాకు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఐకేపీ వీఓఏ జేఏసీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర కమిటీ ఏకాభిప్రాయంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఈ నెల 18 నుంచి రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. వీఓఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఓఏలకు పదోన్నతులు కల్పించడంతో పాటు రూ.20 లక్షల ఆరోగ్య, సాధారణ భీమా సౌకర్యం అందించాలని కోరారు. విధుల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, జీఓ నంబర్ 58ను సవరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని వీఓఏ నాయకులు కోరారు.

# గడపగడపకు బీఎస్పీ సిద్ధాంతాలు తీసుకెళ్లాలి : నల్లాల శ్రీనివాస్



**జమ్మికుంట టౌన్ మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమీక్ష సమావేశం శనివారం జమ్మికుంటలోని ప్రభు ఆర్ట్స్ గ్యాలరీలో హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు మంద సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్, పార్లమెంట్ ఇంచార్జ్ దొడ్డసమ్మయాలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బహుజన సమాజ్ పార్టీని గ్రామ గ్రామాన, గడప గడపకు తీసుకెళ్లే విధంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు మరియు అగ్రకుల పేదలందర్నీ ఏకం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. అసెంబ్లీ కమిటీలతో పాటు సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీల నిర్మాణాన్ని వేగవంతం చేసి క్షేత్రస్థాయిలో పార్టీని బలపరచాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.

ఈనెల 14న కరీంనగర్‌లో ఆదిలాబాద్ జోన్ 1 పరిధిలో నిర్వహించనున్న సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు నల్లాల శ్రీనివాస్ కోరారు.

ఈ సమావేశానికి బీఎస్పీ రాష్ట్ర రథసారథి ఇబ్రహీం శేఖర్, నేషనల్ చీఫ్ సెక్టార్ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అతార్ సింగ్ రావ్, కోఆర్డినేటర్ సురేష్ అర్య, రాష్ట్ర కోఆర్డినేటర్ చంద్రశేఖర్ ముదిరాజ్, ఆదిలాబాద్ జోన్ 1 చీఫ్ కోఆర్డినేటర్ నిషాని రామచంద్రం పాల్గొననున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు, జూపాక గ్రామ ఉపసర్పంచ్ గిన్నారపు మహేందర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జులు డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), వేల్పుల మల్లేశం, ఎమ్మెల్యే, ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, సీనియర్ నాయకులు ఈదునూరి రమేష్, గరిగే చంద్రయ్య, మారముల్లా సదయ్య, రాచపల్లి రమేష్, మామిండ్ల మల్లయ్య, బీఎస్పీ కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఉల్లెందుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ గొలిపెల్లి సంపత్




**ఎల్కతుర్తి, మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలిపెల్లి సంపత్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో నిర్మించుకున్న కొత్త ఇంటిలో లబ్ధిదారులు పట్టెం రజిత-సంపత్ కుటుంబ సభ్యులు గృహప్రవేశం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొలిపెల్లి సంపత్ కుటుంబ సభ్యులకు బట్టలు అందజేసి అభినందనలు తెలిపారు. కొత్త ఇంటిలో కుటుంబ సభ్యులు ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు సొంత గృహం కల్పించడం ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. గ్రామాల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకుని గృహప్రవేశాలు జరుపుకోవడం ప్రభుత్వ సంక్షేమ పాలనకు నిదర్శనమన్నారు. ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు చిర్ర రాజయ్య, పొలాటి రాజేశ్వర్ రావు, పప్పుల గంగాధర్, కట్కూరి శ్రీలత-శ్రీనివాస్, గోల్లేనా రాధికా-ఎల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంద్ పేరుతో బలప్రదర్శన రాజకీయాలు : వొడితల ప్రణవ్ ఫైర్



**హుజురాబాద్, మే 9(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా సమస్యలను పక్కనబెట్టి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నాయని హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శనివారం హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

కరీంనగర్ బంద్ పేరుతో బీఆర్ఎస్ నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ బలప్రదర్శన కోసమే ఈ బంద్ నిర్వహిస్తున్నారని విమర్శించారు. బయటకు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నట్టు కనిపిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపల మాత్రం ఒకటేనని, ప్రజలను మభ్యపెట్టే రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు.

పీఎంజే షాపు ఘటనపై పోలీసులు వేగంగా విచారణ చేపట్టారని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందన్నారు. అలాంటి సమయంలో పోలీసుల పనితీరును అవమానించేలా మాట్లాడటం, బాధ్యతారాహిత్యమని విమర్శించారు. చిన్న సంఘటనలను కూడా రాజకీయ లాభాల కోసం వాడుకోవడం దుర్మార్గ రాజకీయాలకు నిదర్శనమన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రజల సమస్యల కంటే సోషల్ మీడియా హడావుడికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో వారిని పరామర్శించకుండా రాజకీయ హైలెట్‌ల కోసం తిరుగుతున్నారని మండిపడ్డారు. హుజురాబాద్‌లో ప్రజల మధ్య తిరగలేక కరీంనగర్‌లో డ్రామాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇద్దరూ బాధ్యతాయుతంగా మాట్లాడాలని సూచించారు. జిల్లాలో ప్రశాంత పరిస్థితులు ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేయడం సరైంది కాదన్నారు.అలాగే కే టీ ర్,కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు ఆయనలోని అధికార దాహాన్ని బయటపెడుతున్నాయని ప్రణవ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, భారీ రుణమాఫీతో పాటు సన్నవడ్లకు బోనస్, రైతు భరోసా వంటి పథకాలు అమలు చేస్తోందని గుర్తు చేశారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై ఎల్కతుర్తి పోలీసుల ప్రత్యేక దృష్టి

**ఎల్కతుర్తి, మే 09 (తెలంగాణ ముచ్చట్లు):**

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ముందు ఉన్న నేషనల్ హైవే రహదారిపై ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రజల భద్రత కోసం మళ్లీ మూడు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ నరసింహా రావు తెలిపారు.

గతంలో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు రహదారి విస్తరణ పనులు, కొత్తగా డాంబర్ వేయడం కారణంగా తొలగించబడిన విషయం తెలిసిందే. అయితే పోలీస్ స్టేషన్ ముందు వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల తరచూ ప్రమాదాల అవకాశాలు ఏర్పడుతున్నాయని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు వేగ నియంత్రణ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజలు, పాదచారులు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే సందర్శకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైవేపై ప్రయాణించే వాహనదారులు ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతంలో నెమ్మదిగా ప్రయాణించాలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని పోలీసులు సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగానే ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి

- దమ్మపేట యార్డ్‌లో బీజేపీ నేతల ఆందోళన.


**దమ్మపేట, మే 9(తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మార్కెట్ యార్డ్‌లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ బీజేపీ నాయకులు తంబళ్ల రవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యార్డ్‌కు ధాన్యం వచ్చి నెలరోజులు కావస్తున్నా ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. లారీలు లేవనే సాకుతో అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని యార్డ్‌లలో రోజుల తరబడి నిల్వ ఉంచడంతో వర్షాలకు తడిసి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు ప్రభుత్వమని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తే బీజేపీ తరఫున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో దొడ్డా సతీష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సొరకాయల సీతారాములు, రైతులు పాల్గొన్నారు.



## అతివేగం ప్రమాదానికి కారణమా..?

**జమ్మికుంట టౌన్ మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మండలం రామన్నపల్లి సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. జమ్మికుంట నుంచి ఇల్లంతకుంట వైపు అతివేగంగా వెళ్తున్న ఓ కారు ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులోని ఎయిర్ బ్యాగులు తెరుచుకోవడంతో ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. అయితే వాహనం పూర్తిగా దెబ్బతినడంతో పాటు విద్యుత్ స్తంభం ధ్వంసమై ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



## గృహ ప్రవేశాల్లో పాల్గొని లబ్ధిదారులతో ఆనందం పంచుకున్న ప్రణవ్

**జమ్మికుంట టౌన్ మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పట్టణ, మండల పరిధిలో నిర్మించిన పలు ఇందిరమ్మ నూతన గృహాల గృహ ప్రవేశ కార్యక్రమాలకు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వొడితల ప్రణవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. పేద కుటుంబాలు సొంత ఇంటి కలను సాకారం చేసుకుంటూ సంతోషంగా గృహ ప్రవేశాలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

ఇళ్లలోకి అడుగుపెడుతున్న సమయంలో లబ్ధిదారుల కళ్లల్లో కనిపిస్తున్న ఆనందం వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రెండవ విడతలో మరిన్ని ఇళ్లను ఈ నెలాఖరులోగా మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.






# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..
# మూడు నెలల్లోపే దరఖాస్తుల కొలిక్కి

**ఖమ్మం బ్యూరో, మే 9(తెలంగాణ ముచ్చట్లు ):** ప్రజా దర్బార్‌లో స్వీకరించే ప్రతి దరఖాస్తును మూడు నెలల కాలపరిమితి లోపు పరిష్కరించేలా పక్కా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం తిరుమలాయపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాన్ని మూడు క్లస్టర్లుగా విభజించి, ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నిర్వహించిన సభల్లో 14,700 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్లు, భూ సమస్యలు, పింఛన్లు, ఉచిత విద్యుత్ కోరుతూ వచ్చినవేనని పేర్కొన్నారు.

- క్లస్టర్ల వారీగా సమస్యల సేకరణ.. అక్కడికక్కడే పరిష్కారానికి ప్రాధాన్యత
- మే నెలాఖరు నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- తిరుమలాయపాలెం క్లస్టర్ ప్రజా దర్బార్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

తక్షణమే పరిష్కరించే వీలున్న వాటిని స్పాట్‌లోనే పూర్తి చేస్తున్నామని, మిగిలిన వాటిని మూడు నెలల గడువులోపే పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్లు

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన మొదటి ఏడాదిలోనే 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని మంత్రి గుర్తు చేశారు. ఇంటి నిర్మాణ పురోగతి ఆధారంగా లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా నిధులు జమ చేస్తూ పారదర్శకతకు పెద్దపీట వేశామన్నారు. మే నెలాఖరు నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు.

ధరణి చిక్కుముడులకు 'భూ భారతి'

గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ తెచ్చిన తప్పుల వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి విమర్శించారు. ఒకే సర్వే నంబర్‌లోని కొంత భూమి సేకరణ జరిగితే.. మొత్తం నంబర్‌ను నిషేధిత జాబితాలో పెట్టడం వంటి అవకతవకలను సరిదిద్దడానికే 'భూ భారతి' కార్యక్రమాన్ని తీసుకొచ్చామని వివరించారు. సాదా బైనామా దరఖాస్తులను పేదలకు న్యాయం జరిగేలా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్లపై భరోసా

రైతులు పండించిన ప్రతి గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని మంత్రి భరోసా ఇచ్చారు. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తున్నామని, వరితో పాటు మొక్కజొన్నను కూడా పూర్తి స్థాయిలో సేకరిస్తామని తెలిపారు. రైతును రాజును చేయడమే లక్ష్యంగా ఇప్పటికే రూ.2 లక్షల లోపు రుణమాఫీని అమలు చేశామని చెప్పారు. గతంలో రైతులపై బేడీలు వేసిన వారు నేడు కొనుగోలు కేంద్రాల వద్ద విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్, జిల్లా స్థాయి అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజల్లో చైర్మన్ ప్రశాంత్ కుమార్ మమేకం




**జమ్మికుంట టౌన్ మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పట్టణంలో నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలలో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. పట్టణ పరిధిలోని 24వ వార్డులో శ్రీ హనుమాన్ భక్తులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి ప్రార్థనలు చేశారు.

అనంతరం చెన్నబోయిన మనోజ్ కుమార్, చరిత దంపతులు నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొని ప్రత్యేక ఆశీర్వాదాలు అందించారు. తదుపరి పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వారి దాంపత్య జీవితం ఆనందమయంగా ఉండాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా స్థానికులతో ఆత్మీయంగా మాట్లాడిన మున్సిపల్ చైర్మన్ ప్రజల సుఖదుఃఖాలలో ఎల్లప్పుడూ భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాలలో బింగి విశ్వేందర్, బూరుగుపల్లి రాము, పంజాల అనిల్, కౌశిక్, శివ, కపిల్, మణిదీప్ తదితరులు పాల్గొన్నారు.



## వివాహ వేడుకల్లో సందడి చేసిన కాంగ్రెస్ నాయకులు

**హుజురాబాద్, మే 09(తెలంగాణ ముచ్చట్లు ):** హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు శనివారం పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన పలు వివాహ శుభకార్యాలకు హాజరై సందడి చేశారు. వివాహ వేడుకలకు విచ్చేసిన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆత్మీయంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు, వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలతో నిండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆహ్వానం మేరకు ప్రతి శుభకార్యంలో పాల్గొంటూ ప్రజలతో మమేకం కావడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. వివాహ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు నాయకులతో ఫోటోలు దిగుతూ ఉత్సాహం వ్యక్తం చేశారు.

అలాగే వివాహ వేడుకల సందర్భంగా ప్రజల సమస్యలు, పట్టణ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై స్థానికులతో చర్చించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, టౌన్ అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, యువ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాత భూ తగాదాలతో అన్నపై దాడి..

**జమ్మికుంట టౌన్ మే 09 (తెలంగాణ ముచ్చట్లు):**

జమ్మికుంట మండల పరిధిలోని వావిలాల గ్రామంలో పాత భూ వివాదాలు మరోసారి ఉద్రిక్తతకు దారితీశాయి. గ్రామానికి చెందిన జక్కన్న శేఖర్‌పై అతని తమ్ముడు జక్కన్న తిరుపతి దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, శేఖర్ తన షాపులో ఉండగా తిరుపతి అక్కడికి వచ్చి పాత భూమి విషయాలను మనసులో పెట్టుకొని దుర్భాషలాడుతూ చేతులతో దాడి చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో గొడవను ఆపేందుకు వచ్చిన శేఖర్ భార్య కావ్య, కూతురు వర్షిని పై కూడా దాడికి పాల్పడినట్లు ఆరోపించారు. మరోసారి అడ్డుకునేందుకు ప్రయత్నించిన శేఖర్‌ను తిరుపతి బలంగా నెట్టివేయడంతో కిందపడిపోయి చేతికి ఫ్రాక్చర్ అయినట్లు సమాచారం. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

## జమ్మికుంటలో ఉద్రిక్తత..

**పెట్రోలింగ్‌లో పలువురిపై కేసులు నమోదు**

**జమ్మికుంట టౌన్ మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన ఘటనల్లో పలువురిపై కేసులు నమోదు చేశారు. బ్లూ కోర్ట్ సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ కుర్ర శ్రీనివాస్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ శాయంపేట గ్రామ శివారుకు చేరుకోగా, ఎదురుగా ఇసుకతో నిండిన ట్రాక్టర్ కనిపించింది. ట్రాక్టర్‌ను ఆపి అనుమతి పత్రాలు అడగగా డ్రైవర్ ఎలాంటి పత్రాలు చూపించలేదని పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ గాదె మల్లేష్ (గంద్రపల్లి గ్రామం)గా గుర్తించిన పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా, మల్లేష్ కానిస్టేబుల్‌ను దుర్భాషలాడుతూ తోసివేసి విధులకు ఆటంకం కలిగించాడని పేర్కొన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన గాదె హరీష్ కూడా పోలీసులను దుర్భాషలాడి కానిస్టేబుల్‌ను నెట్టివేశాడని తెలిపారు. ఈ ఘటనపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అదేవిధంగా, ఇన్స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గాంధీ చౌరస్తా వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుమిగూడిన కొందరిని విచారించారు. కరీంనగర్‌లో జరగబోయే బంద్ కార్యక్రమానికి మద్దతుగా వెళ్తున్నట్లు వారు చెప్పడంతో తక్కలపల్లి రాజేశ్వరరావు, పొన్నగంటి సంపత్, పొన్నగంటి రాము, ఏబీసీ కౌశిక్, నేరెళ్ల సంతోష్, పగిడే మణికంఠలను అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. ఇంకో ఘటనలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద గుమిగూడిన దొంతరవేన రమేష్, ఎర్రబెల్లి సంపత్ రావు, కొలకాని రాజు, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, జీడి మల్లేష్‌లను పోలీసులు విచారించగా, కరీంనగర్ బంద్‌కు మద్దతుగా వెళ్తున్నట్లు తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# మక్కలు అమ్ముకునేందుకు పోలీస్ స్టేషన్‌లో రైతుల నిరీక్షణ

- అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషన్ వద్దే పడిగాపులు
- బయోమెట్రిక్ కోసం మహిళా రైతుల అవస్థలు
- నిర్వాహకుల తీరుపై రైతుల ఆగ్రహం



**వరంగల్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మక్కలను విక్రయించేందుకు అవసరమైన బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ కోసం రైతులు శుక్రవారం అర్ధరాత్రి వరకు రాయపర్తి పోలీస్ స్టేషన్ వద్దే పడిగాపులు కాశారు. ముఖ్యంగా మహిళా రైతులు రాత్రి వేళల్లో పోలీస్ స్టేషన్‌లోనే నిరీక్షించాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తికాకపోవడంతో రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జాంబవ రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్వాహకులు రైతులతో దురుసుగా ప్రవర్తించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రైతులను అసభ్య పదజాలంతో దూషిస్తూ బయోమెట్రిక్ ప్రక్రియను మధ్యలోనే నిలిపివేసి వెళ్లిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి ఒంటిగంట వరకు వేచి చూసిన రైతులు చివరకు నిరాశతో ఇళ్లకు వెళ్లిపోయినట్లు సమాచారం. పంటను అమ్ముకునేందుకే ఇంత ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నదాతలు వాపోయారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, సరైన సమన్వయం లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు పేర్కొన్నారు. వ్యవసాయాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులకు గౌరవప్రదంగా సేవలు అందించాల్సిన అవసరం ఉందని రైతు సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. పంట విక్రయ ప్రక్రియను సులభతరం చేయాలని కోరుతున్నారు.

# కరీంనగర్ బంద్‌కు ప్రజల మద్దతు లభించింది: కౌశిక్ రెడ్డి

- ప్రభుత్వ వైఫల్యంపై ప్రజల నిరసన అన్న ఎమ్మెల్యే
- శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శ
- దాడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**కరీంనగర్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ బంద్‌కు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇచ్చి ప్రభుత్వ వైఫల్యానికి గట్టి సమాధానం ఇచ్చారని పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. నగరంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వరుస దొంగతనాలు, దాడుల ఘటనలు నిరూపిస్తున్నాయని విమర్శించారు. తనపై, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కార్యాలయంపై జరిగిన దాడులు ప్రజాస్వామ్యంపై జరిగిన దాడులేనని కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాల పేరుతో దాడులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు. బంద్‌ను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేయించడం ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘన అని ఆయన ఆరోపించారు. ప్రజల నిరసనలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. దాడులకు బాధ్యులైన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై కూడా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్‌లో ప్రజల్లో భద్రతాభావం తగ్గిపోయిందని ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై తమ పార్టీ ఎప్పటికీ వెనక్కి తగ్గదన్నారు.

# గోవాలో విదేశీయుల నేరాలు ఆందోళనకరం



ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా పేరొందిన గోవాలో విదేశీయులకు సంబంధించిన నేరాల అంశం ఆందోళన కలిగిస్తోంది. విదేశీయులపై జరిగే నేరాల కంటే, వారే స్వయంగా పాల్పడుతున్న నేరాలు అధికంగా ఉన్నాయని జాతీయ నేర గణాంక సంస్థ నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2022 నుంచి 2024 మధ్యకాలంలో విదేశీయులు బాధితులుగా ఉన్న కేసులతో పోలిస్తే, నిందితులుగా నమోదైన కేసులు ఆరు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గోవాలో పెరుగుతున్న నేరాల ధోరణిపై ఈ వివరాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్సీఆర్బీ డేటా ప్రకారం గత మూడు సంవత్సరాల్లో గోవా పోలీసులు విదేశీయులకు సంబంధించిన మొత్తం 251 కేసులు నమోదు చేశారు. వీటిలో 206 కేసుల్లో విదేశీయులే నిందితులుగా ఉండగా, కేవలం 45 కేసుల్లో మాత్రమే వారు బాధితులుగా ఉన్నారు. ముఖ్యంగా 2024లో విదేశీయులు పాల్పడిన నేరాలు 27 శాతం పెరిగినట్లు అధికారులు గుర్తించారు. హత్యాయత్నం, అత్యాచారం, మోసం, దాడులు, ఫారినర్స్ యాక్ట్ ఉల్లంఘనలు, మాదకద్రవ్యాల అమ్మకం, రవాణా వంటి తీవ్రమైన నేరాల్లో విదేశీయుల ప్రమేయం ఉన్నట్లు తేలింది.

ఈ కేసుల్లో నైజీరియా, రష్యా, నేపాల్, టాంజానియా, బల్గేరియా, బంగ్లాదేశ్ దేశాలకు చెందిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీసా గడువు ముగిసినా అక్రమంగా నివసించడం, డ్రగ్స్ వ్యాపారం వంటి కార్యకలాపాల్లో ఎక్కువ మంది పట్టుబడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో గోవా ప్రభుత్వం చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే విదేశీయుల కోసం మపుసాలో ప్రత్యేక డిటెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

చట్టాన్ని ఉల్లంఘించిన విదేశీయులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు హెచ్చరించారు. శిక్షాకాలం పూర్తయిన తర్వాత ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ ద్వారా వారిని తిరిగి వారి దేశాలకు పంపించే చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పర్యాటక కేంద్రంగా ఉన్న గోవాలో శాంతిభద్రతలు కాపాడటానికి పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. విదేశీయుల కార్యకలాపాలపై మరింత కఠిన పర్యవేక్షణ అవసరమని భద్రతా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# బెంగాల్‌లో మారుతున్న పాలన.. పోలీసుల ఎక్స్ ఖాతాల్లోనూ మార్పులు



పశ్చిమ బెంగాల్‌లో అధికార మార్పుతో ప్రభుత్వ వ్యవస్థల్లో మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కోల్‌కతా పోలీసులు తమ అధికారిక ఎక్స్ ఖాతాలో కీలక మార్పులు చేశారు. మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీలను అన్‌ఫాలో చేసిన కోల్‌కతా పోలీసులు, కొత్త ప్రభుత్వానికి చెందిన ప్రముఖ నేతల ఖాతాలను ఫాలో అవడం ప్రారంభించారు.

ప్రస్తుతం కోల్‌కతా పోలీసుల ఫాలో జాబితాలో నరేంద్ర మోదీ, సీఎం సువేందు అధికారి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి కార్యాలయం, హోంమంత్రి కార్యాలయం వంటి ఖాతాలు ఉన్నాయి. మొత్తం 42 ఖాతాలను ఫాలో అవుతున్న జాబితాలో మమత, అభిషేక్‌లకు స్థానం లేకపోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని బెంగాల్‌లో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. నందిగ్రామ్, భవానీపూర్ స్థానాల్లో విజయం సాధించిన సువేందు అధికారి రాష్ట్ర 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, అమిత్ షా సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు. మరోవైపు సువేందు ప్రమాణ స్వీకారం అనంతరం మమతా బెనర్జీ తన సోషల్ మీడియా ఖాతాల నుంచి "ముఖ్యమంత్రి" హోదాను తొలగించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇవాళ సువేందుతో పాటు మరో ఐదుగురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో మహిళా నేత అగ్నిమిత్రా పాల్ కూడా ఉన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం సీఎం సువేందు అధికారి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో సుశాసనం, అభివృద్ధిపై దృష్టి పెట్టనున్నట్లు ప్రకటించింది.




# ఈడీ, సీబీఐలను కేంద్రం రాజకీయ ఆయుధాలుగా వాడుతోంది: కేజ్రీవాల్

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలను కేంద్ర ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను లక్ష్యంగా చేసుకుని వారిని బీజేపీలో చేరాలని ఒత్తిడి తెస్తున్నారని మండిపడ్డారు. పంజాబ్ మంత్రి సంజీవ్ అరోరా నివాసంలో ఈడీ సోదాలు జరిగిన నేపథ్యంలో కేజ్రీవాల్ మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈడీ, సీబీఐ వంటి సంస్థలను అవినీతి నిరోధానికి కాకుండా రాజకీయ ప్రత్యర్థులను బలహీనపర్చేందుకు ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.

ప్రతిపక్ష నాయకులను భయపెట్టి, కేసులతో ఇబ్బంది పెట్టి చివరకు బీజేపీలో చేరేలా చేయడమే ఈ దాడుల వెనుక అసలు ఉద్దేశమని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. సంజీవ్ అరోరాపై ఈడీ చర్యలు కూడా అదే వ్యూహంలో భాగమని ఆరోపించారు. సంజీవ్ అరోరాకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఈడీ అధికారులు శనివారం విస్తృత సోదాలు నిర్వహించారు. రూ.100 కోట్ల మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా ఢిల్లీ, గురుగ్రామ్, చండీగఢ్ ప్రాంతాల్లోని ఐదు ప్రాంగణాల్లో దాడులు జరిగినట్లు సమాచారం.

ఈ సందర్భంగా గత నెలలో అశోక్ మిత్తల్ ఇంటిపై జరిగిన ఈడీ దాడులను కూడా కేజ్రీవాల్ ప్రస్తావించారు. ఈడీ సోదాలు జరిగిన మరుసటి రోజే అశోక్ మిత్తల్ బీజేపీలో చేరారని గుర్తుచేశారు. అంటే ఈడీ దాడుల అసలు లక్ష్యం అవినీతి బయటపెట్టడం కాదని, రాజకీయంగా ఒత్తిడి తెచ్చి బీజేపీలో చేర్చుకోవడమేనని ఆరోపించారు. సంజీవ్ అరోరా విషయంలో కూడా అదే పద్ధతి అనుసరిస్తున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. కొద్ది రోజుల క్రితం కూడా ఆయన నివాసంలో సోదాలు జరిగాయని, అయినప్పటికీ ఆయన బీజేపీలో చేరకపోవడంతో మళ్లీ ఈడీ దాడులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే పంజాబ్‌లో ఈడీ దాడులు ప్రారంభమయ్యాయని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. గత కొన్నేళ్లుగా కేంద్ర ప్రభుత్వం పంజాబ్‌ను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

పంజాబ్ జలాల అంశం, పంజాబ్ యూనివర్సిటీపై నియంత్రణ ప్రయత్నాలు, గ్రామీణాభివృద్ధి నిధుల నిలిపివేత వంటి అంశాలను ప్రస్తావిస్తూ కేంద్రం రాష్ట్రంపై ఒత్తిడి పెంచుతోందన్నారు. ఇప్పుడు వరుస ఈడీ దాడులతో రాజకీయ వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. పంజాబ్ గురువుల పుణ్యభూమి అని పేర్కొన్న కేజ్రీవాల్ చారిత్రక ఉదాహరణలను కూడా ప్రస్తావించారు. గతంలో ఔరంగజేబు అణచివేతకు గురువులు ఎలా ఎదురు నిలిచారో, ఇప్పుడు కూడా పంజాబ్ ప్రజలు అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడతారని అన్నారు.

మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరుస్తోందని ఆరోపించిన కేజ్రీవాల్, ప్రతిపక్షాలను అణిచివేయడానికి కేంద్ర సంస్థలను వాడటం ప్రమాదకర పరిణామమని వ్యాఖ్యానించారు. పంజాబ్ ప్రజలు భయపడబోరని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

# బీజేపీని ఓడించేందుకు విపక్షాలన్నీ ఏకం కావాలి



పశ్చిమ బెంగాల్‌లో తొలిసారి అధికారంలోకి వచ్చిన బీజేపీని ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా ఉన్న విపక్షాలన్నీ ఏకం కావాలని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలతో పాటు బీజేపీని వ్యతిరేకించే విద్యార్థి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు.

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి సందర్భంగా కోల్‌కతాలోని కాళీఘాట్ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో మమత మాట్లాడారు. బీజేపీయే తమకు మొదటి శత్రువని, ఆ పార్టీని ఎదుర్కొనేందుకు ఎవరితోనైనా చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. బంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రవ్యాప్తంగా టీఎంసీ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని మమత ఆరోపించారు. బీజేపీ శ్రేణుల్లోకి సంఘ విద్రోహ శక్తులు ప్రవేశించి రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు.

ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన వెంటనే తమకు కల్పించిన భద్రతను ఉపసంహరించుకున్నారని మమత ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల అనంతరం దేశవ్యాప్తంగా ఉన్న పలువురు విపక్ష నేతలు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి రోజే టీఎంసీ కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తోందని మమత ప్రకటించారు. భవిష్యత్తులో బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత స్థాయిలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో మమత తన ఓటమిని పరోక్షంగా అంగీకరించినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం కావడంతో ఆమె తన ఎక్స్ ఖాతా బయోను కూడా మార్చుకున్నారు. తన ఎక్స్ బయోలో "అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ వ్యవస్థాపక ఛైర్‌పర్సన్, బంగాల్ ముఖ్యమంత్రి (15,16,17వ విధానసభ)" అని మార్చుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇటీవల జరిగిన ఎన్నికలపై కూడా మమత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము బీజేపీతో కాకుండా ఎన్నికల సంఘంతో పోరాడామని ఆరోపించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ఎన్నికలు ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు. ప్రజా తీర్పు వల్ల కాకుండా కుట్రల కారణంగానే తమ ఓటమి జరిగిందని మమత ఆరోపించారు. ఎన్నికల ఫలితాల తర్వాత సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితరులు తనకు ఫోన్ చేసి సంఘీభావం తెలిపారని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇండియా కూటమిని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని మమత స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ వ్యతిరేక శక్తులను ఒక్క తాటిపైకి తీసుకురావడమే తమ లక్ష్యమని తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ముఖ్యమంత్రిగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపు చోటుచేసుకుంది. భారతీయ జనతా పార్టీ తరపున తొలి ముఖ్యమంత్రిగా సువేందు అధికారి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. స్వాతంత్ర్యం తర్వాత బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నేతలు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందే భారీగా పార్టీ కార్యకర్తలు, ప్రజలు అక్కడికి చేరుకున్నారు. బెంగాల్ రాజకీయాల్లో కొత్త అధ్యాయం ప్రారంభమైందంటూ బీజేపీ నేతలు వ్యాఖ్యానించారు.

**బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో ఘన కార్యక్రమం**
**మోదీ సమక్షంలో బాధ్యతలు చేపట్టిన సువేందు**
**మమతా ఆధిపత్యానికి ముగింపు పలికిన ఎన్నికలు**

ప్రమాణ స్వీకారం అనంతరం సువేందు అధికారి ప్రధానమంత్రి మోదీ ఆశీస్సులు తీసుకున్నారు. వేదికపై ఉన్న జాతీయ నాయకులతో కరచాలనం చేశారు. బెంగాల్ అభివృద్ధి, పరిపాలనలో కొత్త దిశగా ముందుకు సాగుతామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ 294 స్థానాల్లో 207 స్థానాలు గెలుచుకుని ఘన విజయం సాధించింది. పదిహేనేళ్లుగా కొనసాగుతున్న తృణమూల్ కాంగ్రెస్ పాలనకు



ఈ ఎన్నికలు ముగింపు పలికాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆధిపత్యానికి గండి పడడంతో బెంగాల్ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. సువేందు అధికారి ప్రస్తుతం బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తొమ్మిదో వ్యక్తిగా నిలిచారు. ఆయన వయస్సు 55 సంవత్సరాలు. గ్రామీణ ప్రాంతాల్లో ఆయనకు గట్టి పట్టు ఉంది. ఆయన తండ్రి సిసిర్ అధికారి గతంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. విద్యార్థి దశలో కాంగ్రెస్ విద్యార్థి విభాగం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన సువేందు, అనంతరం తృణమూల్ కాంగ్రెస్‌లో కీలక నేతగా ఎదిగారు. మమతా బెనర్జీకి అత్యంత సన్నిహితుడిగా ఉన్న సువేందు అధికారి తర్వాత కాలంలో ఆమెకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా మారారు. నందిగ్రామ్ రాజకీయాల్లో ఆయన ప్రాధాన్యం మరింత పెరిగింది. రెండు సార్లు మమతాపై పోటీ చేసి విజయం సాధించిన ఆయన ఇప్పుడు రాష్ట్ర అత్యున్నత పదవిని అధిరోహించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# జన సేవా కనెక్ట్ కింద ఆధునిక పోస్టాఫీసు ప్రారంభం



కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముంబైలోని అంధేరి రైల్వే స్టేషన్ పోస్టాఫీసును ఆధునికీకరించిన "ఫ్యూచర్ రెడీ పోస్టాఫీసు"గా ప్రారంభించారు. తపాలా శాఖ ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న "జన సేవా కనెక్ట్" కార్యక్రమంలో భాగంగా ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. అంధేరి రైల్వే స్టేషన్ పోస్టాఫీసు మహారాష్ట్రలో తొలి జన సేవా కనెక్ట్ పోస్టాఫీసుగా నిలవగా, దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమంలో ప్రారంభమైన రెండో పోస్టాఫీసుగా గుర్తింపు పొందింది. ప్రజలకు వేగవంతమైన, సాంకేతిక ఆధారిత సేవలు అందించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా అధికారులు తెలిపారు. దేశంలోని 17 రాష్ట్రాల్లో ఎంపిక చేసిన 40 పోస్టాఫీసుల్లో ప్రయోగాత్మకంగా ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. పోస్టాఫీసులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా మార్చి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సింధియా మాట్లాడుతూ, పోస్టల్ సేవలను డిజిటల్ సాంకేతికతతో అనుసంధానం చేసి ప్రజలకు సులభమైన సేవలు అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు తపాలా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఫడ్నవీస్ మాట్లాడుతూ, ఆధునీకరించిన పోస్టాఫీసులు ప్రజలకు సమయపాలనతో కూడిన సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. డిజిటల్ యుగానికి అనుగుణంగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయడంలో ఇటువంటి కేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా పోస్టల్ సేవల ఆధునీకరణకు జన సేవా కనెక్ట్ కార్యక్రమం కొత్త దిశానిర్దేశం చేస్తోందని అధికారులు అభిప్రాయపడ్డారు.






# భారత్–ట్రినిడాడ్ అండ్ టొబాగో ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష

భారత విదేశాంగ మంత్రి సుబ్రహ్మణ్యం జైశంకర్ ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కమ్లా ప్రసాద్ బిసెసర్‌తో పాటు ఆమె మంత్రివర్గ సహచరులతో సమావేశమై భారత్-ట్రినిడాడ్ అండ్ టొబాగో ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న సహకార కార్యక్రమాలు, భవిష్యత్తు భాగస్వామ్య అవకాశాలపై విస్తృతంగా చర్చించినట్లు జైశంకర్ వెల్లడించారు. గత ఏడాది ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీల అమలుపై కూడా సమీక్ష చేపట్టినట్లు తెలిపారు. భారత్, ట్రినిడాడ్ అండ్ టొబాగో మధ్య వాణిజ్యం, విద్య, ఆరోగ్యం, సాంకేతికత, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. పరస్పర అభివృద్ధికి దోహదపడే కొత్త కార్యక్రమాలు, ఆలోచనలపై కూడా చర్చలు జరిగినట్లు పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య చారిత్రాత్మక, సాంస్కృతిక సంబంధాలు ఎంతో బలంగా ఉన్నాయని జైశంకర్ పేర్కొన్నారు. భారతీయ మూలాలు కలిగిన ప్రజలు అధిక సంఖ్యలో ఉన్న ట్రినిడాడ్ అండ్ టొబాగోతో సంబంధాలకు భారత్ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమావేశంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై అధికారులు చర్చించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాల బలోపేతంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. భారత్ చేపడుతున్న విదేశాంగ విధానంలో కరేబియన్ దేశాలతో సంబంధాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇరు దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.



# ఏబీ పీఎం–జే హ్యాకథాన్ -2026 విజయవంతం

జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఏబీ పీఎంజే ఆటో అడ్జుడికేషన్ హ్యాకథాన్-2026 విజయవంతంగా ముగిసింది. ఇండియా ఏఐ మిషన్, బెంగళూరులోని భారత విజ్ఞాన సంస్థ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్య బీమా క్లెయిమ్‌ల పరిశీలనలో కృత్రిమ మేధ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ హ్యాకథాన్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 3,500 మందికి పైగా పాల్గొని తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించారు. నిపుణుల జ్యూరీ పరిశీలన అనంతరం అమలు చేయగలిగే ఉత్తమ కృత్రిమ మేధ పరిష్కారాలను ఎంపిక చేశారు. విజేత జట్లకు రూ. 5 లక్షల వరకు నగదు బహుమతులు అందజేశారు. ఎంపికైన పరిష్కారాలను ఏబీ పీఎంజే పథకంలో అమలు చేసే దిశగా జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థ ముందుకు సాగనుందని అధికారులు తెలిపారు.

క్లెయిమ్‌ల పరిశీలనలో పారదర్శకత, భద్రత, మోసాల నివారణకు కృత్రిమ మేధ కీలక పాత్ర పోషిస్తుందని సమావేశాల్లో నిపుణులు అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో డిజిటల్ ఆరోగ్య సేవలను మరింత విస్తరించేందుకు బలమైన సాంకేతిక వేదికలు అవసరమని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు, భారతదేశానికి అనుగుణమైన ఆరోగ్య కృత్రిమ మేధ నమూనాల అభివృద్ధిపై ప్రత్యేక చర్చలు నిర్వహించారు. పరస్పర అనుసంధానంతో కూడిన డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ నిర్మాణంపై కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఆరోగ్య సేవల్లో సాంకేతికత వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో ఇటువంటి హ్యాకథాన్‌లు వినూత్న పరిష్కారాలకు దోహదపడతాయని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# శ్యామ ప్రసాద్ ముఖర్జీ కలలను సాకారం చేస్తాం: మోదీ

పశ్చిమ బెంగాల్‌లో తొలి బీజేపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ సేవలను స్మరించుకోవడం సహజమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆయన కలలను సాకారం చేయడానికి ఎలాంటి ప్రయత్నాన్నీ వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కోల్‌కతాలో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మఖన్‌లాల్ సర్కార్‌ను కలిసినట్లు మోదీ తెలిపారు. డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీతో కలిసి పనిచేసిన మఖన్‌లాల్ సర్కార్ జమ్మూ కాశ్మీర్ ఉద్యమ సమయంలో అరెస్టు కూడా అయ్యారని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ అంతటా బీజేపీ పార్టీ బలోపేతానికి మఖన్‌లాల్ సర్కార్ జీవితాన్ని అంకితం చేశారని ప్రధాని కొనియాడారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను పార్టీతో అనుసంధానం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రజల మధ్య పనిచేసిన ఇలాంటి నాయకులు బీజేపీకి స్ఫూర్తిగా నిలుస్తారని మోదీ అన్నారు. కార్యకర్తల అంకితభావం వల్లే పార్టీ ప్రజల్లో మరింత బలపడుతోందని అభిప్రాయపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటాన్ని పార్టీ శ్రేణులు చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణిస్తున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సుశాసనం లక్ష్యంగా కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని బీజేపీ నాయకత్వం వెల్లడిస్తోంది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. బెంగాల్ రాజకీయాల్లో ఈ పరిణామం కొత్త మార్పులకు దారితీస్తుందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



# పెరుగుతున్న డీహైడ్రేషన్ కేసులు

- దేశవ్యాప్తంగా ఆస్పత్రులకు పెరుగుతున్న రోగుల రద్దీ
- ఏసీ గదుల్లో పనిచేసేవారికీ పెరుగుతున్న ప్రమాదం
- అప్రమత్తంగా లేకపోతే హీట్ స్ట్రోక్ ముప్పు

**డెస్క్, మే 9 (తెలంగాణ ముచ్చట్లు):** దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో డీహైడ్రేషన్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. పలు చోట్ల ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బయట పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా నగర ప్రాంతాల్లో వేడి గాలులు, ఉక్కపోత కారణంగా ప్రజలు అలసట, తలనొప్పి, వాంతులు, నీరసం వంటి సమస్యలతో ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. హైదరాబాద్‌లోని బస్తీ దవాఖానాల్లో కూడా వేడి సంబంధిత వ్యాధులతో వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు వైద్యులు చెబుతున్నారు. భారత వాతావరణ శాఖ ఇప్పటికే పలు రాష్ట్రాలకు హీట్‌వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే ఎక్కువ వేడి రోజులుండే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాల్లో తీవ్ర ఎండలు కొనసాగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం ప్రజల ఆరోగ్యంపై మరింత ప్రభావం చూపుతోంది.

డీహైడ్రేషన్ అనేది కేవలం బయట తిరిగే వారికే వచ్చే సమస్య కాదని వైద్యులు చెబుతున్నారు. రోజంతా ఏసీ గదుల్లో పనిచేసే ఉద్యోగుల్లో కూడా ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. చల్లని గదుల్లో దాహం అనిపించకపోవడంతో చాలా మంది తగినంత నీరు తాగడం లేదు. దీంతో శరీరంలో నీటి శాతం తగ్గి అలసట, తల తిరగడం, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఐటీ ఉద్యోగులు, బ్యాంకు సిబ్బంది, కాల్ సెంటర్ ఉద్యోగులు ఎక్కువగా ఈ సమస్య బారిన పడుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. వైద్యుల ప్రకారం డీహైడ్రేషన్ ప్రారంభ దశలోనే గుర్తించకపోతే అది హీట్ ఎగ్జాస్టన్, హీట్ స్ట్రోక్‌గా మారే ప్రమాదం ఉంది. శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా పెరగడం, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితులు ప్రాణాంతకంగా మారవచ్చని హెచ్చరిస్తున్నారు. దేశంలోని పలు ఆస్పత్రుల్లో అత్యవసర విభాగాలకు వేడి కారణంగా వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని సమాచారం.

ప్రస్తుతం ప్రభుత్వాలు కూడా అప్రమత్తమయ్యాయి. పలు రాష్ట్రాల్లో హీట్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తూ ఆస్పత్రుల్లో ప్రత్యేక పడకలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చల్లని తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. బస్సు స్టాండ్లు, రద్దీ ప్రాంతాల్లో నీటి కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానిక సంస్థలకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో పాఠశాలల సమయాల్లో కూడా మార్పులు చేస్తున్నారు.

పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. నాగ్‌పూర్‌లో జరిగిన నీట్ పరీక్షల సమయంలో తీవ్ర ఎండల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనడంతో హైకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అనంతరం పరీక్షా కేంద్రాల్లో కూలర్లు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు. వైద్యులు ప్రజలకు పలు సూచనలు చేస్తున్నారు. దాహం లేకపోయినా తరచూ నీరు తాగాలని, ఓఆర్ఎస్, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని హెచ్చరిస్తున్నారు. అధిక కాఫీ, శీతల పానీయాలు తీసుకోవడం డీహైడ్రేషన్‌ను మరింత పెంచవచ్చని నిపుణులు చెబుతున్నారు.

పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. శరీరంలో నీరు తగ్గితే మూత్రపిండాల పనితీరు దెబ్బతినే ప్రమాదం కూడా ఉందని హెచ్చరిస్తున్నారు. మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండల ప్రభావం మనుషులకే కాకుండా జంతువులపై కూడా తీవ్రంగా పడుతోంది. పుణెలో పెంపుడు జంతువులు, వీధి జంతువుల్లో కూడా డీహైడ్రేషన్ కేసులు పెరిగినట్లు వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. పక్షులు, మూగజీవాల కోసం బయట నీటి పాత్రలు ఉంచాలని జంతు సంరక్షణ సంస్థలు ప్రజలను కోరుతున్నాయి.

వాతావరణ మార్పుల ప్రభావంతో భవిష్యత్తులో హీట్‌వేవ్ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశముందని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. వేసవిలో చిన్న లక్షణాలను కూడా అలక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదిస్తే తీవ్రమైన ప్రమాదాలను నివారించవచ్చని సూచిస్తున్నారు.



# తల్లి ప్రేమకు ప్రతీకగా మదర్స్ డే

- అమ్మ త్యాగాలను గుర్తు చేసుకునే ప్రత్యేక రోజు
- కుటుంబ బంధాలను మరింత బలపరిచే వేడుక
- ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహణ



**డెస్క్, మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** మనిషి జీవితంలో ఎప్పటికీ మారని బంధం తల్లి బంధం. ఒక బిడ్డ ఈ ప్రపంచంలోకి రాకముందే తన ప్రేమను పంచడం ప్రారంభించే వ్యక్తి తల్లే. పిల్లల కోసం తన జీవితాన్ని అంకితం చేస్తూ, వారి ఆనందాన్ని తన ఆనందంగా భావించే అమ్మ గొప్పతనాన్ని గుర్తు చేసుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే నెల రెండో ఆదివారం "మదర్స్ డే"గా జరుపుకుంటారు. ఈసారి మే 10న ఈ ప్రత్యేక రోజు వచ్చింది. తల్లి ప్రేమ, ఆమె త్యాగాలు, కుటుంబం కోసం చేసిన సేవలను స్మరించుకునే సందర్భంగా ఈ రోజును ఎంతో భావోద్వేగంగా నిర్వహిస్తున్నారు. తల్లి అనేది కేవలం ఒక సంబంధం మాత్రమే కాదు, అది ఒక అపారమైన భావోద్వేగం. బిడ్డ చిన్ననాటి నుంచి పెద్దవాడయ్యే వరకు ప్రతి అడుగులోనూ తల్లి పాత్ర కీలకంగా ఉంటుంది. పిల్లల ఆరోగ్యం, చదువు, భవిష్యత్తు కోసం ఎన్నో కష్టాలను భరిస్తూ కుటుంబానికి అండగా నిలుస్తుంది. రాత్రింబవళ్లు కష్టపడుతూ పిల్లల ముఖంలో చిరునవ్వు చూడటమే తన లక్ష్యంగా భావించే అమ్మ ప్రేమకు ఎలాంటి ప్రతిఫలం ఉండదని పెద్దలు చెబుతుంటారు.

మదర్స్ డే సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ తల్లులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ బహుమతులు అందిస్తున్నారు. కొందరు కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటే, మరికొందరు అమ్మతో కలిసి సమయం గడుపుతూ ఆమెను ఆనందింపజేస్తున్నారు. సోషల్ మీడియా వేదికల్లో కూడా తల్లులతో ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటూ భావోద్వేగ సందేశాలు పోస్టు చేస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలలు కూడా మదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. విద్యార్థులతో పాటలు, నృత్యాలు, ప్రసంగాలు చేయిస్తూ తల్లి గొప్పతనాన్ని తెలియజేస్తున్నారు. కొన్నిచోట్ల తల్లులకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తూ వారి సేవలను గుర్తిస్తున్నారు. చిన్నారులు తమ చేతులతో తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు ఇచ్చి తల్లుల పట్ల ప్రేమను వ్యక్తం చేస్తున్నారు.

నేటి కాలంలో ఉద్యోగాలు, వ్యాపారాలు, సాంకేతిక జీవనశైలి కారణంగా కుటుంబ సభ్యులతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదర్స్ డే కుటుంబ బంధాలను మరింత దగ్గర చేసే సందర్భంగా మారుతోంది. పిల్లలు తమ తల్లులతో గడిపే ప్రతి క్షణాన్ని గుర్తు చేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ రోజు కుటుంబాల్లో ఆనందాన్ని తీసుకువస్తోంది. తల్లి చేసే త్యాగాలకు కొలమానం ఉండదు. పిల్లలు అనారోగ్యానికి గురైతే తల్లి పడే ఆందోళన, వారి విజయాల్లో ఆమె పొందే ఆనందం, వారి బాధల్లో తాను కూడా కుంగిపోవడం వంటి భావాలు తల్లి ప్రేమను మరింత గొప్పగా నిలబెడతాయి. తన పిల్లల కోసం ఎన్నో కలలను త్యాగం చేస్తూ వారికి మంచి భవిష్యత్తు ఇవ్వడమే అమ్మ లక్ష్యంగా ఉంటుంది.

ప్రస్తుతం సమాజంలో వృద్ధాశ్రమాల సంఖ్య పెరుగుతున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. తమను పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను కొందరు నిర్లక్ష్యం చేస్తున్న ఘటనలు కూడా కనిపిస్తున్నాయి. మదర్స్ డే సందర్భంగా తల్లిదండ్రుల పట్ల గౌరవం చూపించాలని, వారిని ప్రేమగా చూసుకోవాలని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధాప్యంలో ఉన్న తల్లులకు పిల్లల ఆదరణ ఎంతో అవసరమని చెబుతున్నారు. మదర్స్ డే చరిత్రను పరిశీలిస్తే అమెరికాలోనే ఈ సంప్రదాయం ప్రారంభమైంది. తల్లుల సేవలను గౌరవించాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ఈ ప్రత్యేక రోజు తర్వాత ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రస్తుతం అనేక దేశాలు ఈ రోజును ఎంతో ఘనంగా జరుపుకుంటున్నాయి. భారతదేశంలో కూడా గత కొన్నేళ్లుగా మదర్స్ డే వేడుకలు విస్తృతంగా జరుగుతున్నాయి.

వైద్యులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు ఇలా ప్రతి రంగంలోనూ ఉన్న మహిళలు తల్లులుగా కుటుంబ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తున్నారు. ఉద్యోగ జీవితంతో పాటు కుటుంబాన్ని చూసుకోవడం అనేది ఎంతో కష్టమైన పని అయినప్పటికీ తల్లులు దాన్ని చిరునవ్వుతో నిర్వహిస్తున్నారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉండటంలో తల్లి పాత్ర ఎంతో ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. మదర్స్ డే అనేది కేవలం ఒక రోజు మాత్రమే కాదు. ప్రతి రోజూ తల్లిని గౌరవించాల్సిన అవసరం ఉందనే విషయాన్ని గుర్తు చేసే సందర్భం. అమ్మ ప్రేమకు విలువ కట్టలేమని, ఆమె చేసిన సేవలకు జీవితాంతం రుణపడి ఉంటామని చాలా మంది భావోద్వేగంగా చెబుతున్నారు. తల్లి ఉన్న ఇల్లు స్వర్గంతో సమానమని పెద్దలు చెప్పిన మాటలను మరోసారి గుర్తు చేస్తూ మదర్స్ డే ప్రతి కుటుంబంలో ప్రేమ, ఆనందం, అనుబంధాలను మరింత పెంచుతోంది.



# లూపస్‌పై అవగాహనే ప్రాణరక్షణ

- శరీరాన్నే శత్రువుగా భావించే అరుదైన వ్యాధి
- మహిళల్లో ఎక్కువగా కనిపిస్తున్న లూపస్
- ముందస్తు గుర్తింపుతో నియంత్రణ సాధ్యం

**డెస్క్, మే 09 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందిని ప్రభావితం చేస్తున్న అరుదైన ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో "లూపస్" ఒకటి. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మే 10న "ప్రపంచ లూపస్ దినోత్సవం" నిర్వహిస్తున్నారు. శరీరాన్ని రక్షించాల్సిన రోగనిరోధక వ్యవస్థే ఆరోగ్యకరమైన కణాలపై దాడి చేయడం ఈ వ్యాధి ప్రత్యేకత. సరైన సమయంలో గుర్తించకపోతే గుండె, మూత్రపిండాలు, చర్మం, కీళ్లపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. లూపస్‌ను ఆటో ఇమ్యూన్ వ్యాధిగా వైద్యులు పేర్కొంటున్నారు. సాధారణంగా మన శరీరాన్ని వైరస్‌లు, బ్యాక్టీరియా నుంచి రక్షించే రోగనిరోధక వ్యవస్థ కొన్ని సందర్భాల్లో తప్పుగా పనిచేసి ఆరోగ్యకరమైన కణాలనే దాడి చేస్తుంది. దీంతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటాయి. ఈ పరిస్థితినే లూపస్‌గా పిలుస్తారు. ఇది ఒకరికి ఒక విధంగా, మరొకరికి మరో విధంగా ప్రభావం చూపడం వల్ల గుర్తించడం కొన్నిసార్లు కష్టంగా మారుతుంది.

ఈ వ్యాధి ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా 15 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న మహిళలు ఎక్కువగా ప్రభావితమవుతున్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. పురుషుల్లో కూడా ఈ వ్యాధి కనిపించినప్పటికీ మహిళల్లో దాని తీవ్రత ఎక్కువగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. హార్మోన్ల మార్పులు, వంశపారంపర్య కారణాలు, పర్యావరణ ప్రభావాలు దీనికి కారణమవుతున్నాయని భావిస్తున్నారు. లూపస్ లక్షణాలు వ్యక్తికి వ్యక్తికి మారుతూ ఉంటాయి. తరచూ జ్వరం రావడం, తీవ్రమైన అలసట, కీళ్ల నొప్పులు, చర్మంపై ఎర్రటి మచ్చలు, జుట్టు రాలడం, చేతులు కాళ్లు వాపు రావడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. కొందరిలో సూర్యరశ్మికి ఎక్కువ సున్నితత్వం కూడా ఉంటుంది. ఈ లక్షణాలను చాలామంది సాధారణ సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యాధి మరింత ముదిరే ప్రమాదం ఉంది.

లూపస్ పూర్తిగా నయం అయ్యే వ్యాధి కాకపోయినా సరైన చికిత్సతో నియంత్రణలో ఉంచుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ముందస్తుగా గుర్తిస్తే అవయవాలపై తీవ్ర ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు. రక్తపరీక్షలు, వైద్య పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించి తగిన మందులు అందిస్తారు. జీవనశైలిలో మార్పులు, సమతుల్య ఆహారం, ఒత్తిడి తగ్గించడం కూడా చికిత్సలో కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం లూపస్‌పై ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. లక్షణాలు స్పష్టంగా కనిపించకపోవడం వల్ల చాలామంది ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఈ వ్యాధి గురించి చాలా మందికి తెలియకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఆరోగ్య శాఖలు, వైద్య సంస్థలు మరింత విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. లూపస్‌తో బాధపడుతున్నవారు మానసిక ఒత్తిడికి కూడా గురవుతున్నారు. తరచూ అలసట, నొప్పులు, దీర్ఘకాలిక చికిత్స కారణంగా చాలా మంది నిరాశకు లోనవుతున్నారు. కుటుంబ సభ్యులు, సమాజం నుంచి మద్దతు లభిస్తే రోగులు ధైర్యంగా జీవించగలరని వైద్యులు చెబుతున్నారు. ఈ వ్యాధిని బలహీనతగా కాకుండా ఆరోగ్య పరిస్థితిగా చూడాలని సూచిస్తున్నారు. సాంకేతిక వైద్య రంగం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో లూపస్‌పై కొత్త పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఆధునిక చికిత్సా విధానాలతో రోగులు సాధారణ జీవితాన్ని గడిపే అవకాశాలు పెరుగుతున్నాయి. అయితే వ్యాధిని పూర్తిగా అరికట్టేందుకు ఇంకా మరిన్ని పరిశోధనలు అవసరమని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడా అరుదైన వ్యాధుల చికిత్సపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రపంచ లూపస్ దినోత్సవం సందర్భంగా వైద్యులు ప్రజలకు ఒక ముఖ్యమైన సూచన చేస్తున్నారు. శరీరంలో తరచూ అసాధారణ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని చెబుతున్నారు. స్వయంగా మందులు వాడటం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధిని త్వరగా గుర్తిస్తే చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉంటాయని సూచిస్తున్నారు. లూపస్‌పై అవగాహన పెరగడం ద్వారా ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చు. అరుదైన వ్యాధుల పట్ల సమాజంలో సరైన చైతన్యం రావాల్సిన అవసరం ఉంది. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా చిన్న లక్షణాలకే పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు. ప్రజల్లో అవగాహన పెంచడమే ప్రపంచ లూపస్ దినోత్సవం ప్రధాన ఉద్దేశమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అమ్మ..

# జీవితానికి తొలి గురువు



ప్రపంచంలో ప్రతి మనిషి జీవితానికి ఆది, అంతం "అమ్మ"తోనే ముడిపడి ఉంటుంది. ప్రేమకు రూపం ఉంటే అది తల్లి రూపమే అంటారు. తల్లి కేవలం ఒక వ్యక్తి కాదు - కుటుంబానికి ధైర్యం, పిల్లలకు మార్గదర్శి, జీవితానికి వెలుగు. తన పిల్లల కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడే మహోన్నత వ్యక్తిత్వం తల్లిదే. మదర్స్ డే సందర్భంగా వివిధ రంగాలకు చెందిన మహిళలను ఇంటర్వ్యూ చేయగా వారు మాతృత్వం గురించి చెప్పిన మాటలు ప్రతి ఒక్కరిని ఆలోచింపజేశాయి. ఉద్యోగ బాధ్యతలు, కుటుంబ కర్తవ్యాలు, పిల్లల భవిష్యత్తు- ఇలా ఎన్నో బాధ్యతల మధ్య తల్లి ఎలా తన జీవితాన్ని అంకితం చేస్తుందో వారు భావోద్వేగంగా వివరించారు.

మహిళలంతా ఒకే మాట చెప్పారు - మదర్స్ డే అనేది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక మాత్రమే కాదని, తల్లుల ప్రేమ, త్యాగం, సేవలను గుర్తు చేసుకునే ప్రత్యేక సందర్భంగా భావించాలని సూచించారు. సమాజ నిర్మాణంలో తల్లి పాత్ర అత్యంత కీలకమని, ప్రతి తల్లికి గౌరవం, ప్రేమ ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అభిప్రాయపడ్డారు.

నేటి సమాజంలో మహిళలు ఉద్యోగాలు, కుటుంబ బాధ్యతలు రెండింటినీ సమర్థంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నప్పటికీ, తల్లిగా వారి బాధ్యత మరింత గొప్పదిగా నిలుస్తోంది. పిల్లల భవిష్యత్తు కోసం తన కలలను కూడా పక్కన పెట్టే తల్లి ప్రేమకు ఎలాంటి కొలమానం ఉండదని వారు పేర్కొన్నారు.

**తల్లి ప్రేమకు ముగింపు లేదు - తల్లి త్యాగానికి ప్రతిఫలం లేదు - అమ్మ అనే పదంలోనే ప్రపంచం మొత్తం దాగి ఉందని ఈ మహిళల మాటల్లో స్పష్టమైంది.**



## అనురాధ
**ప్రభుత్వ ఉపాధ్యాయురాలు**

### తల్లిగా మరింత బాధ్యత పెరుగుతుంది

ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అనురాధ మాట్లాడుతూ, "తల్లి అనేది పిల్లల జీవితంలో తొలి గురువు. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్య నేర్పితే, ఇంట్లో తల్లి జీవితం ఎలా గడపాలో నేర్పిస్తుంది. చిన్నప్పటి నుంచి పిల్లలలో మంచితనం, క్రమశిక్షణ, సంస్కారం పెంపొందించేది తల్లే. ఈ రోజుల్లో ఉద్యోగం, ఇంటి బాధ్యతలు రెండింటినీ సమతుల్యం చేయడం చాలా కష్టమైన పని అయినా, పిల్లలు సంతోషంగా ఎదుగుతుంటే ఆ ఆనందం ముందు అలసట కనిపించదు" అని చెప్పారు.

పిల్లలతో గడిపే ప్రతి క్షణం జీవితంలో అత్యంత విలువైనదని ఆమె పేర్కొన్నారు. "తల్లిగా మారిన తర్వాత జీవితంపై బాధ్యత మరింత పెరుగుతుంది. మన కోసం కాదు.. పిల్లల భవిష్యత్తు కోసం ఆలోచించడం మొదలవుతుంది. వారు మంచిగా ఎదగాలి, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా మారాలి అనేదే ప్రతి తల్లి కల" అని అన్నారు.



## కవిత
**ప్రభుత్వ ఉపాధ్యాయురాలు**

### సరైన దారిని కూడా చూపించాలి

మరో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కవిత మాట్లాడుతూ, "ప్రపంచంలో ఎలాంటి ప్రేమతోనూ తల్లి ప్రేమను పోల్చలేం. పిల్లలు బాధపడితే తల్లి మనసు తట్టుకోదు. వారి ఆనందంలోనే తల్లి సంతోషం దాగి ఉంటుంది. ఉద్యోగం నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కూడా తల్లికి విశ్రాంతి ఉండదు. పిల్లల చదువు, ఆరోగ్యం, భవిష్యత్తు... ప్రతి విషయంలో తల్లి ఎప్పుడూ ఆలోచిస్తూనే ఉంటుంది" అని పేర్కొన్నారు.

నేటి సాంకేతిక యుగంలో పిల్లలు మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రుల బాధ్యత మరింత పెరిగిందని ఆమె అన్నారు. "పిల్లలతో మాట్లాడటం, వారి మనసును అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. తల్లి కేవలం ప్రేమను మాత్రమే కాదు, సరైన దారిని కూడా చూపించాలి" అని చెప్పారు.



## డా.మానస శ్యామల
**స్త్రీ వైద్యనిపుణురాలు**

### ప్రాణం పణంగా పెట్టే తల్లి గొప్పది

డాక్టర్ మానస శ్యామల రెడ్డి మాట్లాడుతూ, "వైద్యురాలిగా ప్రతి రోజు తల్లుల త్యాగాన్ని దగ్గరగా చూస్తుంటాను. ప్రసూతి గదిలో ఒక తల్లి పడే బాధను చూసినప్పుడు మాతృత్వం ఎంత గొప్పదో అర్థమవుతుంది. తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి బిడ్డకు జన్మనిచ్చే తల్లి నిజంగా గొప్పది" అని భావోద్వేగంగా చెప్పారు.

ఆమె మాట్లాడుతూ, "ప్రతి తల్లి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలి. చాలామంది మహిళలు కుటుంబం కోసం అన్నీ చేస్తారు కానీ తమ ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తారు. ఆరోగ్యంగా ఉంటేనే తల్లి కుటుంబాన్ని బలంగా నిలబెట్టగలదు" అని సూచించారు. ఒక వైద్యురాలిగా ఎన్నో కుటుంబాల్లో తల్లి పాత్రను దగ్గరగా గమనించానని, కుటుంబాన్ని ఒక్కటిగా ఉంచే శక్తి తల్లిదేనని ఆమె అన్నారు.



## నవత
**గృహిణి**

### తల్లి జీవితానికి సెలవులు ఉండవు

గృహిణి నవత మాట్లాడుతూ, "తల్లి జీవితానికి సెలవులు ఉండవు. ఉదయం నుంచి రాత్రి వరకు కుటుంబం కోసం ఆలోచిస్తూ, అందరి అవసరాలు చూసుకుంటూ గడుస్తుంది. పిల్లలు చిన్నవాళ్లుగా ఉన్నప్పుడు వారి కోసం నిద్ర మానేస్తాం. వారు పెద్దవాళ్లు అయిన తర్వాత కూడా వారి భవిష్యత్తు గురించే ఆలోచిస్తుంటాం" అని చెప్పారు.

"పిల్లలు ప్రేమగా 'అమ్మ' అని పిలిచిన ప్రతిసారి మనసులో చెప్పలేని ఆనందం కలుగుతుంది. తల్లిగా ఉండటం ఒక వరం. కుటుంబం మొత్తం సంతోషంగా ఉంటే అదే తల్లికి నిజమైన పండుగ" అని ఆమె పేర్కొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in